క్లుప్తంగా

నేత్రదానం.. కార్నియాల సేకరణ



సత్యనారాయణ (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరంలో ఆదివారం మృతిచెందిన కళ్ళెట్టి సత్యనారాయణ కళ్లను ఆయన కోరిక మేరకు కుటుంబసభ్యులు దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావును సంప్రదించగా, ఆయన ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ప్రతినిధులకు సమాచారం అందించారు. ఆస్పత్రి ప్రతినిధులు సత్యనారాయణ మృతదేహం నుంచి కంటి కార్నియాలు సేకరించారు. సోమవారం ఈ విషయాన్ని మానేపల్లి రామారావు మీడియాకు వెల్లడించారు. సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యుల స్ఫూర్తితో మరింత మంది నేత్రదానానికి ముందుకు రావాలని, అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన కోరారు.

ఎన్‌బీసీ గుర్తింపు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (అటానమస్‌)కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపును మరో మూడేళ్లపాటు పొడిగించినట్టు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.సాయి రోహిత్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలోని ఈఈఈ, సివిల్ ఇంజినిరంగ్ విభాగాలకు ఈ పొడిగింపు ఇచ్చినట్టు చెప్పారు. ప్రిన్సిపాల్ ఎం మురళీధర రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మజ్జిగ పంపిణీ



మాట్లాడుతున్న డీఈఓ వెంకట లక్ష్మమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ఏలూరు జిల్ల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకట లక్ష్మమ్మ మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. సాటి ఉపాధ్యాయులకు సహాయకారిగా యూటీఎఫ్ ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం స్ఫూర్తివంతంగా ఉందని అన్నారు.

పచ్చని చెట్లపై కూటమి పగ

- నూరేళ్లు పైబడిన వృక్షాలను నరికేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- పర్యావరణ ప్రేమికుల పోరాటాలు విఫలం



జిల్లా పరిషత్ కార్యాలయంలో నరికివేసిన భారీ వృక్షం



వృక్షం నరికివేతను అడ్డుకుంటున్న హిందూ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : పచ్చదనం – పరిశుభ్రత అనేది ఒకప్పుడు టీడీపీ నినాదం. అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేతలు పచ్చదనంపై పగ బట్టినట్టు వ్యవహరిస్తున్నారు. నగర ప్రజలకు పచ్చదనాన్ని దూరం చేస్తూ, పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ భారీ వృక్షాలను నేలమట్టం చేస్తున్నారు. ఏలూరు పడమర వీధి దొంగల మండపం వద్ద ఉన్న రెండు భారీ వృక్షాలను గత ఏడాది నవంబర్ నెలలో నరికించి వేశారు. గత మార్చి 23వ తేదీన నగరం నడిబొడ్డున జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో నూరేళ్లు పైబడి వయసున్న మరో వృక్షాన్ని నరికించివేశారు. తాజాగా ఈ నెల 4న శాతవాహన నగర్‌లోని 150 సంవత్సరాల పైబడిన వయస్సున్న రావివృక్షాన్ని నరికించివేశారు. ఇలా వారి కన్ను పడిన వృక్షాలన్నీ నేలమట్టమైపోతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిద్ర లేవని అధికారులు

వృక్షాల కూల్చివేతపై ముందుగానే ఫిర్యాదులు చేసినా అధికారులు నిద్ర నటిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోని వృక్షం కూల్చివేత అడ్డుకోవాలంటూ హిందూ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు జిల్లా పరిషత్ సీఈఓను ముందుగానే కోరినా స్పందించలేదు. వృక్షం కొమ్మలను నరికివేసే సమయంలో హిందూ సంఘాల నాయకులు వెళ్లి అడ్డుకున్నారు. దీంతో నరికివేతను నిలుపుదల చేశారు. నరికిన కొమ్మలు ఎమయ్యాయో నేటికీ ఎవరికీ తెలియని పరిస్థితి. శాతవాహన నగర్‌లోని భారీ రావి వృక్షాన్ని నరుకుతున్న విషయాన్ని త్రిటౌన్ సీఐకి ఫిర్యాదు చేయగా ఇద్దరు కినిస్టేబుళ్లు వచ్చి ఫిర్యాదు చేసిన వారి ఫొటోలు తీసుకుని వెళ్లిపోయారు. ఈ వృక్షం తాలూకు కలపను మాయం చేసినట్టు స్థానికులు చెబుతున్నారు.



శాతవాహన నగర్‌లో భారీ వృక్షాన్ని తొలగించిన ప్రాంతం

కొనసాగుతున్న కబ్జా యత్నాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాకుండానే భారీ వృక్షాలను మాయం చేస్తున్నారు. ఆయా స్థలాల కబ్జాకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. వృక్షాల నరికివేతపై ఇప్పటికే హిందూ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది రామనపూడి శివప్రసాద్ లోకాయుక్తలో కూడా ఫిర్యాదు చేశారు. కూటమి నాయకులు చేసే అరాచకాలను నిలువరించడం ఒకరిద్దరి వల్ల సాధ్యం కాదని నగర ప్రజలంతా మూకుమ్మడిగా వ్యతిరేకిస్తేనే పచ్చదనాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోగలుగుతామని చెబుతున్నారు.

వృక్షాల నరికివేతను అడ్డుకుంటాం



ఇటీవల మహావృక్షాల తొలగింపు దిశగా అనేక మంది ప్రయత్నాలు చేస్తున్నారు. అనుమతులు లేకుండానే భారీ వృక్షాలను నేల మట్టం చేసే పనిలో ఉంటున్నారు. ఆయా వృక్షాల నరికివేతతో వచ్చే కలపను అమ్మకుంటూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా వృక్షాలు ఉంటున్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటూ భావి అవసరాలకు ప్రభుత్వ భూములనేవి లేకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నారు. వృక్షాల నరికివేతను అరికట్టడానికి పోరాటాలు కొనసాగిస్తాం.

– రామనపూడి శివప్రసాద్, హిందూ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

న్యాయ పోరాటం చేస్తాం



ఏలూరు పడమర వీధి దొంగల మండపం వద్ద ఉన్న 20 ఏళ్లకు పైగా వయసు ఉన్న భారీ చెట్లను ఒక ఆలయ కార్యనిర్వహణాధికారి అక్రమంగా నరికించివేశారు. అక్కడ ఆ ఆలయానికి సంబంధించిన స్థలమూ లేదు. ఆలయ ప్రాంగణం కాకపోయినా, వాటివల్ల ఎవరికీ ఇబ్బంది లేకపోయినా, నలుగురికీ నీడను ఇస్తున్నా పట్టించుకోకుండా చెట్లను నరికించడంపై న్యాయ పోరాటం చేస్తున్నాం. చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన ప్రభుత్వ అధికారులే దగ్గరుండి నరికించడం అన్యాయం.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త

వృక్షాల తొలగింపు నేరం



అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో వృక్షాలను తొలగించడం నేరం. ప్రజావసరాలకు అడ్డంకిగా ఉంటే ముందుగా అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. తగిన నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం. చెట్ల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో భారీ వృక్షాన్ని తొలగించడంపై పోలీస్ కేసు నమోదైంది. శనివారపు పేటలో కార్పొరేషన్ పరిధిలో ఉన్న భారీ వృక్షం నరికివేతను అటవీశాఖ పరిశీలించింది. దీనిపై ఆ శాఖ అధికారులతో మాట్లాడాం.

– ఎస్వీకే కుమార్, అటవీశాఖ ఏలూరు డివిజన్ టెరిటోరియల్ రేంజర్

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం ఎంతో అవసరమవుతుందని, పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి సమయాల్లో రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. ఒకరి రక్తదానం ద్వారా ఆరుగురు వ్యక్తులను ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని అన్నారు. రక్తం నుంచి ప్లాస్మా, ప్లేట్ లెట్లు, ఎర్ర, తెల్ల రక్త కణాలు వంటి కాంపోనెంట్లు అందించవచ్చని తెలిపారు. రక్తదానానికి వందలాది మంది యువకులు రావడం అభినందనీయమన్నారు. జిల్లా సహకార అధికారి ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ 2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని, ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి డాక్టర్ ప్రసాద రావు, డీసీఎంఎస్ బీఎం వీఎస్ కృష్ణమోహన్, సిబ్బంది సుధాకరరావు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణ మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట శ్రీరామ మందిరంలో ఫెండ్స్ యూనిటీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శ్రీ భద్రాద్రి సీతారాముల కల్యాణ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం వసంతోత్సవం, చక్రవారి పూజలు చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. భక్తుల గోత్ర నామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు.

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

ఏలూరు (టూటౌన్): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉద్యోగులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి మనిషీ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మంచి ఆహారం తీసుకోవాలని, గర్భిణి తన కాన్పు సమయంలో ప్రారంభం నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండాలన్నారు. తగిన ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, విశ్రాంతితో పాటు ఆహారం, వ్యాయామం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు రోహిత్, పవన్ దీప్తి, మలేరియా హెల్త్ ఎడ్యుకేటర్ గోవిందరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్, డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది

పౌష్టికాహారం అందించాలి

చిల్డ్రన్ హోమ్ పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన పోణంగి రోడ్డు, వీవీఆర్ గార్డెన్ వద్ద ఉన్న రవితేజ చిల్డ్రన్ హోమ్‌ను సందర్శించారు. పరిశుభ్రత, పౌష్టికాహారం, సమయపాలన పాటించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని అన్నారు. న్యాయవాది రత్నరాజు చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ ఐ.రాజు తదితరులు పాల్గొన్నారు.

లాంగ్ రన్నింగ్‌లో పతకాల పంట

- జాతీయ పోటీల్లో వెంకట్ లోకేష్ ప్రతిభ
- సాయ్ సెంటర్‌లో శిక్షణ



లాంగ్‌రన్నింగ్‌లో పతకాలు సాధించిన వెంకట్ లోకేష్

ఏలూరు రూరల్ : పరుగు పందెంలో లాంగ్ రన్నింగ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో సత్తా చాటాలంటే కఠోర సాధన అవసరం. శారీరక ధృఢత్వంతో పాటు మానసికంగా బలంగా ఉండాలి. శరీరంలో సత్తువ తగ్గిపోతున్నప్పటికీ సుదూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించాలన్న పట్టుదల పెరుగుతూనే ఉండాలి. అందుకే అనేక మంది అథ్లెట్లు లాంగ్ రన్నింగ్‌లో పోటీ పడేందుకు వెనకడుగు వేస్తారు. నిమిషాల్లో ముగిసిపోయే 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలో పోటీ పడేందుకే ఇష్టపడతారు. ఇందుకు భిన్నంగా ఏలూరు సాయ్ సెంటర్ అథ్లెట్ జి.వెంకట్ లోకేష్ లాంగ్ రన్నింగ్‌లో అద్భుత ప్రతిభ చాటుతున్నాడు. కోచ్ డీఎస్‌వీ వెంకట ప్రసాద్ పరివేక్షణలో కఠోర సాధన చేస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభా పాటవాలు చాటుతున్నాడు.

16 ఏళ్ల వయస్సులోనే..

వెంకట్‌లోకేష్ స్కూల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు పంట పండిస్తున్నాడు. 2023 నుంచి 2025 వరకు జరిగిన పోటీల్లో లాంగ్‌రన్నర్‌గా రాణిస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం స్కూల్ స్థాయి పోటీల్లో పాల్గొని కేవలం 4 నిమిషాల 26 సెకన్లలో 1500 మీటర్ల పరుగు పందెం పూర్తిచేసి బంగారు పతకం సాధించాడు. 59వ రాష్ట్ర స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలో 6.03 నిమిషాల్లో పరుగు పూర్తి చేసి సిల్వర్ మెడల్ చేజిక్కించుకున్నాడు. ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్‌మెడల్ సాధించాడు. 2004లో జరిగిన ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ మీట్‌లో 2 వేల పరుగు పందెం 6.36 సెకన్లు, ఎస్‌జీఎఫ్ జాతీయ పోటీల్లో 1500 మీటర్ల పరుగు 4.23 సెకన్లతో పూర్తి చేసి సత్తా చాటాడు.

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా

రానున్న రోజుల్లో మరింత సాధన చేసి జాతీయ స్థాయి సీనియర్ విభాగంలో రాణించి పతకం సొంతం చేసుకుంటా. మంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తల్లిదండ్రులు వెంకటయ్య, గంగమ్మను గొప్పగా చూసుకోవాలి. అథ్లెటిక్స్‌లో రాణించాలన్న పట్టుదల ఉన్నవారికి సాయ్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుంది. ఇక్కడ కోచ్‌లు మంచి పౌష్టికాహారం, శిక్షణ అందిస్తూ చదివిస్తున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం సైతం అందిస్తున్నారు.

– వెంకట్ లోకేష్

మల్కాపురంలో ఆధార్ నమోదు కేంద్రం



ఆధార్ నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మల్కాపురం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ కార్యదర్శి జగదీష్ చంద్ర ప్రసాద్, వీఆర్ఓ తలారి రాజా రత్నస్వామి ప్రజలకు సూచించారు. సోమవారం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ 38 మందికి ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేశారు. ఈ ప్రక్రియను గ్రామ కార్యదర్శి, వీఆర్ఓలు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది జ్యోతి తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.అశోక్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం టూటౌన్ సీఐగా పని చేస్తోన్న వైవీ రమణ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ వీఆర్‌కు తరలించగా, తాజాగా అటాచ్‌మెంట్‌పై సీఐగా అశోక్‌కుమార్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. 2009 ఎస్సై బ్యాచ్‌కు చెందిన అశోక్‌కుమార్ గతంలో ఏలూరు ఎస్సైగా పనిచేసిన అనుభవం ఉంది. తూర్పుగోదావరి జిల్లాలో సీఐగా విధులు నిర్వర్తించగా, ప్రస్తుతం ఏలూరు సైబర్‌సెల్ సీఐగా పనిచేస్తూ అటాచ్‌మెంట్‌పై టూటౌన్ సీఐగా బాధ్యతలు తీసుకున్నారు. టూటౌన్ పోలీస్ సిబ్బంది ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా, నేరాలకు పాల్పడినా సహించేదిలేదని అశోక్‌కుమార్ అన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాత్రి గస్తీని మరింత పటిష్టం చేస్తూ ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందిస్తామని వివరించారు.





మీ కోసంలో ఆగిన ఆన్‌లైన్

ఏలూరు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక (మీకోసం) కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైనప్పటికీ ఆన్‌లైన్ సర్వర్ పనిచేయలేదు. టెక్నీషియన్‌తో రిపేర్ చేయించడంతో 11.45 గంటల సమయంలో సర్వర్ అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారులు తీవ్ర అసౌకర్యానికి గురైన దృశ్యాలివీ.

– సాక్షి ఫొటో గ్రాఫర్/ ఏలూరు

నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

దెందులూరు: ఏలూరు క్రాంతి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించే వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని వివరించారు. అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ కోఆర్డినేటర్ కారుమూరి సునీల్ కుమార్, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ తోపాటు జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సొసైటీ మాజీ చైర్మన్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ హాజరవుతారని పేర్కొన్నారు. నియోజవర్గంలోని ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులంతా సమావేశానికి హాజరుకావాలి కోరారు.

మంచి ఆలోచనలతో మెలగాలి



ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

భీమడోలు: క్రైస్తవ విశ్వాసులు మంచి ఆలోచనలతో మెలగాలని కర్నూలు సేవా కేంద్రం డైరెక్టర్ ఫాదర్ అజిష్ అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో 38వ సజీవధారల సువార్త కూడికలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. భీమడోలు విచారణ కర్త షింటో థామస్ ఆధ్వర్యంలో విచారణ పరిధిలోని క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ఫాదర్ అజిష్ దైవ సందేశాన్ని అందజేశారు. తపస్సు కాలంలో ఉన్న మనమందరం మంచి ఆలోచనలను కలిగి ఉండాలని, కేవలం 40 రోజులకే పరిమితం కాకుండా సంవత్సరం అంతా మన హృదయం పవిత్రంగా ఉండాలని కోరారు. అనంతరం మరియ మాత విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. విచారణకర్త ఫాదర్ షింటో థామస్, డీపాల్ ప్రిన్సిపల్ ఫాదర్ నెల్సన్ జాన్, విశ్వాసులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	34	బీన్సచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	54
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	38	కంద	76
కాకర కాయలు	30-34	బీట్‌రూట్	30
బీరకాయలు	30	కీరా దోస	30
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	26	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	38
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	31
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	34